సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 1 । ఆగస్టు । 2024



గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

నందిగాం బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు విచారణ చేపడుతున్నారు.

- 8లో



వేతనాల లేమి

ఉపాధి వేతనాలు అందక వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మే నుంచి వేతనాలు ఇవ్వాల్సి ఉంది.

- 8లో

వైద్యాధికారుల విచారణ

పొందూరు: 'కనిమెట్టలో బహిరంగ ప్రదేశంలో మందులు' అంటూ సాక్షిలో వచ్చిన కథనంపై బుధవారం వైద్యాధికారి శివశంకర్ గ్రామంలో విచారణ జరిపారు. నేలబావి, చెత్తకుప్పల్లో పారబోసిన మందులను పరిశీలించారు. గ్రామ వైద్య సిబ్బందిని, సచివాలయం సిబ్బందిని విచారించారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వాణికుమారి, హెచ్‌ఎస్ మణి ప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

డీఎస్పీలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు డీఎస్పీలు యర్రగుంట శృతి (శ్రీకాకుళం), జి.నాగేశ్వరరెడ్డి (కాశీబుగ్గ), డి.బాలచంద్రారెడ్డి (టెక్కలి), బి.విజయ్ కుమార్ (డీటీసీ అటాచ్డ్‌ఎస్సీ/ఎస్టీసెల్)లు బదిలీ అయ్యారు. వీరు తక్షణమే పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా లో ప్రస్తుతం ఒక్క కాశీబుగ్గ డివిజన్‌కే గుంటూరు డీఎస్‌ఆర్‌పీ అటాచ్డ్ డీసీఆర్బీలో విధులు నిర్వర్తిస్తున్న పాత్రిని శ్రీనివాసరావు డీఎస్పీగా రానున్నారు. శ్రీకాకుళం, టెక్కలి, ఎస్సీ/ఎస్టీ సెల్‌లకు అధికారులు రావాల్సి ఉంది.

సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి రైతులకు సకాలంలో రుణాలు అందజేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఆప్కాబ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు కోసం రైతులు కాళ్లరిగేలా బ్యాంకుల చుట్టూ తిరగకుండా ఒక్క రోజులోనే అందజేయాలన్నారు. రైతుల ఆధార్‌తో మీభూమి, ఈసీ, ఈ–క్రాప్ అనుసంధానం చేయాలన్నారు. డీసీసీబీల ద్వారా ఈ ఏడాది రూ.38.7 వేల కోట్ల రుణాలు అందజేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి చెప్పారు. సమీక్షలో ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డీఈఓగా తిరుమల చైతన్య



ఎస్.తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖాధికారిగా వమ్మరవల్లి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు వెలువరించింది. ఈయన గతంలోనూ శ్రీకాకుళం డీఈఓగా, ఉప విద్యాశాఖాధికారిగా, సమగ్రశిక్ష పీవోగా పనిచేశారు. ఇప్పటి వరకు డీఈఓగా పనిచేసిన కె.వెంకటేశ్వరరావు బుధవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో తిరుమల చైతన్య పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులై బాధ్యతలు కూడా స్వీకరించారు. ఈయనకు ఏడీలు, కార్యాలయ సిబ్బంది, ఎంఈఓలు, హెచ్‌ఎంలు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, మరో రెండు వారాల్లో ఏడీల పదోన్నతుల తర్వాత పూర్తిస్థాయిలో డీఈఓల నియామకం ప్రభుత్వం చేపడుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీఈఓగా తిరుమల చైతన్య కొనసాగుతారా..? కొత్త వారు వస్తారా అనేది వేచిచూడాలి.

సమగ్ర సర్వేకు ఆదేశం



గురుకుల స్థలం పరిశీలిస్తున్న ఆర్డీవో రంగయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్‌ఎంపురంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయానికి ప్రభుత్వం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమగ్రంగా స్థల సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీవో రంగయ్య పాఠశాలను మంగళవారం సందర్శించి ప్రిన్సిపాల్ పి.శివప్రసాద్‌తో చర్చించారు. డాక్యుమెంట్లు, ఆధారాలు అందజేయాలని ఆదేశించారు. 1983లో గురుకుల పాఠశాల ఏర్పడగా, 1985లో 112 సర్వేనంబర్ సబ్ డివిజన్ 635/2లో 40 ఎకరాలు గురుకుల పాఠశాలకు కేటాయించారు. ఈ భూమి ప్రస్తుతం గురుకులం ఆధ్వర్యంలో లేదు. మరోవైపు 15 ఎకరాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమి కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈ భూమి ఆక్రమణలకు గురవుతుందని ప్రిన్సిపాల్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. మొదటిసారి ఫిబ్రవరి 19న ఫిర్యాదుచేశారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారుల వద్ద ఎటువంటి రికార్డులు లేవు. దీంతో ఏపీ గురుకుల విశ్వవిద్యాలయం సొసైటీ వద్ద ఉన్న డాక్యుమెంట్లు తీసుకు రావాలని ఆర్డీవో సూచించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ గుంటూరులోని సొసైటీ కార్యాలయానికి బుధవారం వెళ్లి సెక్రటరీకి సమస్య వివరించారు. ఆ రికార్డులు రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్‌లో ఉండిపోయాయని అధికారులు చెప్పినట్లు సమాచారం. గురుకుల సొసైటీ డాక్యుమెంట్లు అందజేస్తే సమగ్ర సర్వేకు వీలవుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ చక్రవర్తి తెలిపారు.

నేతలెప్పుడొచ్చేనో..
పుస్తకాలెప్పుడందేనో..!

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పంపిణీ కాని పుస్తకాలు, బ్యాగులు
- తామొచ్చే వరకు పంపిణీ చేయవద్దంటూ ప్రజాప్రతినిధులు హుకుం
- తలలు పట్టుకుంటున్న ప్రిన్సిపాళ్లు
- విద్యార్థులకు తప్పని ఎదురు చూపులు
- ఇప్పటికే పాఠశాల, వర్సిటీ విద్యలో కూటమి నేతల జోక్యం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/ శ్రీకాకుళం న్యూకాలనీ:

కూటమి ప్రభుత్వ నాయకులు విద్యా వ్యవస్థను రాజకీయం చేస్తున్నారు. ఈ ఏడాది మే నెల నాటికే వైఎస్ జగన్ ప్రభుత్వం సిద్ధం చేసిన పాఠశాల విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూలు, సాక్సులు, బెల్ట్ తదితర వస్తువుల పంపిణీ సమయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, విద్యా కమిటీ చైర్మన్‌లున్నా తామే పంపిణీ చేయాలని ఒత్తిడి చేసి తమ చేతుల మీదుగా కానిచ్చారు. ఆ తర్వాత విశ్వ విద్యాలయాలపై పడ్డారు. గతంలో నియమితులైన వర్సిటీ వీసీలు, రిజిస్ట్రార్ల మొదలుకుని తమకు నచ్చని వారిని బలవంతంగా బయటకు పంపే ప్రయత్నం చేశారు. వీరి సతాయింపు, దౌర్జన్యాలు భరించలేక నానా ఇబ్బందులు పడ్డారు. చివరికి టీడీపీ నాయకులు ఒత్తిడి చేసి, బలవంతంగా రాజీనామాలు చేయించారు. ఇప్పుడు ప్రభుత్వ కళాశాలలను వదలడం లేదు. వారికిస్తామన్న పాఠ్యపుస్తకాలు, బ్యాగులు తదితరాల పంపిణీకి మోకాలడ్డుతున్నారు. తామొచ్చే వరకు పంపిణీ చేయవద్దని ప్రిన్సిపాళ్లకు హుకుం జారీ చేశారు. తమకు తీరిక దొరికే వరకు వేచి ఉండాలని ఆంక్షలు పెట్టారు. దీంతో జిల్లాకొచ్చిన ఇంటర్ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు మూలన పడి ఉన్నాయి.

కళాశాలల్లో రాజకీయ క్రీడ..

పాఠశాలల పరిస్థితులు ఇలా ఉంటే తాజాగా కళాశాలలపై కూడా పడ్డారు. ప్రభుత్వం సమకూర్చిన విద్యా సామగ్రిని తాము వచ్చి పంపిణీ చేసే వరకు విద్యార్థులకు అందజేయడానికి వీల్లేదంటూ ప్రస్తుత ఎమ్మెల్యేలు.. ప్రిన్సిపాళ్లకు హుకుం జారీ చేశారు. ఫొటో ఫోజులు, పబ్లిసిటీ కోసం విద్యార్థులను ఇబ్బంది పెడుతుండటంతో పుస్తకాలు, బ్యాగులు మూలనపడి ఉన్నాయి. కాలేజీలు మొదలై ఇప్పటికే రెండు నెలలు పూర్తయి యూనిట్ టెస్టులు కూడా ముగిసిపోయాయి. అయినా ఇంతవరకు పుస్తకాలు, బ్యాగులు అందలేదు. ఈ విషయమై విద్యార్థులు నిలదీస్తుండటంతో ప్రిన్సిపాళ్లు మనోవేదనకు గురవుతున్నారు.

విద్యాలయాలపై ఎందుకంత కక్ష?

వైఎస్ జగన్ హయాంలో..

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఏటా ప్రభుత్వ పాఠశాలలకు నిర్వహణ వ్యయం కింద విద్యార్థుల సంఖ్య మేరకు రూ.15వేల నుంచి రూ.లక్షా 50వేల వరకు నిర్వహణ వ్యయం కింద ఇచ్చేవారు. ఏటా ఫిబ్రవరిలో సంబంధిత ప్రధానోపాధ్యాయులకు నేరుగా జమ చేసేవారు. విద్యుత్ బిల్లులు, సుద్దముక్కలు, వైట్ పేపర్లు ఇతరత్రా వాటికి కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. టాయిలెట్ నిర్వహణకు అవసరమైన బకెట్లు, క్లీనర్స్ తదితర మెటీరియల్‌ను సైతం అందజేసేవారు. దీంతో ఉపాధ్యాయులకు ఇబ్బంది ఉండేది కాదు.

రూపాయి విడుదల చేయని బాబు సర్కారు..

ప్రభుత్వం మారడంతో పరిస్థితి మొదటికొచ్చింది. చంద్రబాబు ఇంతవరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం సిద్ధం చేసిన స్టూడెంట్ కిట్లే పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు. ఇవన్నీ చూసి ఉపాధ్యాయులకు గతం గుర్తుకొస్తోంది. 2014–19లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రూ. 5వేలు మాత్రమే పాఠశాలలకు మెయింటెనెన్స్ కింద ఇచ్చేవారు. ఆ సొమ్ము ఎటూ సరిపోక ఉపాధ్యాయులు ఇబ్బంది పడేవారు. మళ్లీ ఆ పరిస్థితి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.



కాలేజీలో పంపిణీ కాకుండా ఉన్న పాఠ్యపుస్తకాలు



ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూలనపడి ఉన్న నోటుబుక్స్, బ్యాగులు

ప్రిన్సిపాళ్లపై ఆర్థిక భారం

నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు ఈ మూడు వస్తువులు వారం వారం వ్యవధిలో మండల కేంద్రాలకు రావడంతో.. అక్కడా సరిపడా స్థలం లేకపోవడంతో వెంట వెంటనే పంపిణీ చేసేలా ఎంఈఓలు ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి చేశారు. దీంతో మండల కేంద్రాలకు వాహనాలను, కూలీలను పంపించి కళాశాలకు చెందిన సామగ్రిని తెప్పించుకున్నారు. ఇలామూడు సార్లు వాహనాలు, కూలీలను పంపించి తెప్పించుకున్నారు. అందుకయ్యే ఖర్చును ప్రభుత్వం భరించలేదు. ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో ప్రిన్సిపాళ్లే చేతిచమురును వదిలించుకోవాల్సి వచ్చింది. ఇందుకైన ఖర్చులను కనీసం బిల్లులు కూడా పెట్టడానికి వీల్లేదని అధికారులు సూచించినట్టు భోగట్టా.

త్వరలోనే అందిస్తాం



ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించింది. మండల కేంద్రాలకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు ఇప్పటికే రావడంతో కాలేజీల ప్రిన్సిపాళ్లు తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేశాం. వీలైనంత వేగంగా విద్యార్థులకు అందజేస్తాం.

– శివ్వాల తవిటినాయుడు, డీవీఈఓ, ఇంటర్మీడియెట్ విద్య, శ్రీకాకుళం

మెటీరియల్లో కొరత..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	38
మోడల్ స్కూల్/కాలేజీలు	13
కేజీబీవీలు	25
సోషల్ వెల్ఫేర్	9
హైస్కూల్ ప్లస్	12
ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల	01
మహాత్మాజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ కళాశాల	01
ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు	13,250
సెకెండియర్ విద్యార్థులు	12,510
కావాల్సిన పుస్తకాలు	1.50 లక్షలు
జిల్లాకు చేరిన పుస్తకాలు	1.05 లక్షలు

పాలిటెక్నిక్‌లో 34 స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిసెట్–2024 రెండు విడతల కౌన్సెలింగ్ అనంతరం మిగిలి ఉన్న సీట్లకు సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 24 మందికి, మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 10 మందికి ప్రవేశాలు కల్పించారు. పాలిసెట్ ర్యాంకు, 10వ తరగతి మార్కులు ఆధారంగా మొత్తం 34 మందికి అడ్మిషన్లు ఇచ్చారు. స్పాట్ అడ్మిషన్లకు ఎటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. ప్రిన్సిపాళ్లు గురుగుబెల్లి దామోదర్‌రావు, గోవిందనాయుడు పర్యవేక్షించారు.

కూటమి దౌర్జన్యాలను సమష్టిగా ఎదుర్కోవాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే కిరణ్
- వైఎస్ జగన్ పంపిన రూ.లక్ష చెక్ బాధితుడికి అందజేత



అసిరయ్యకు చెక్ అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అరాచకాలు విపరీతంగా పెరిగాయని, వాటిని సమష్టిగా ఎదుర్కోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంపిన లక్ష రూపాయల చెక్కును ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చేతుల మీదుగా బాధితుడు ఆళ్ల అసిరయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారువ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అసిరయ్య కారును గుర్తు తెలియని దుండగులు కాల్చేశారని చెప్పారు. కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడమే కాకుండా వాళ్ల ఆస్తులు కూడా ధ్వంసం చేయడం కూటమి ప్రభుత్వం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. హామీలు ఎగ్గొట్టేందుకే సూపర్ సిక్స్ హామీలు చూస్తే భయమేస్తోందని కొత్త నాటకం ఆడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రణస్థలం వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు మైలపల్లి కామరాజు, పాల రామసూరిరెడ్డి, పాల రాము, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో భారీ చోరీ

- 12 తులాల బంగారం, కేజీన్నర వెండి, రూ.3.5 లక్షల నగదు మాయం
- ఇంటి యజమానిని నెట్టేసి చోరీ సొత్తుతో పరారైన దుండగులు



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం

టెక్కలి రూరల్: టెక్కలిలో మంగళవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. ఇంటి యజమానిని పక్కకు నెట్టేసి బంగారం, వెండి ఆభరణాలు, మూడున్నర లక్షల సొమ్ముతో పరారయ్యారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి రోటరీ నగర్–1లో కర్రి వేణుగోపాలరావు అనే ఉపాధ్యాయుడు భార్యాపిల్లలతో కలిసి మూడు అంతస్తుల భవనంలో నివాసముంటున్నారు. కింద ఫ్లోర్ గోదాముకు అద్దెకు ఇచ్చారు. మిగిలిన రెండు ఇళ్లల్లో వేణుగోపాలరావు కుటుంబమే నివాసముంటోంది. మంగళవారం రాత్రి ఉక్కపోతగా ఉండటంతో ఏసీ సదుపాయం ఉన్న మూడో ఫ్లోర్‌కు కుటుంబ సభ్యులంతా వెళ్లి నిద్రపోయారు. ఇదే అదునుగా దుండగులు రెండో ఫ్లోర్‌లో ప్రవేశించి ఆభరణాలు, డబ్బులు మూటగా కట్టారు. ఆ సమయంలో ఏదో అలజడి వచ్చిందని గుర్తించిన ఇంటి యజమాని రెండో ఫ్లోర్‌కు వచ్చి చూసేసరికి ఓ దుండగుడు వేగంగా వచ్చి వేణుగోపాలరావును నెట్టేసి పారిపోయాడు. మరో వ్యక్తి బంగారం, వెండి, డబ్బు మూటలు పట్టుకుని ఫ్లోర్ పైనుంచి కిందకు దూకేశాడు. కొంతసేపటికి తేరుకున్న వేణుగోపాలరావు లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడాన్ని గుర్తించారు. అందులో సుమారు 12 తులాల బంగారం, కేజీన్నర వెండి ఆభరణాలు, రూ.3.5 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసునమోదు చేసినట్లు టెక్కలి సీఐ పైడయ్య తెలిపారు. కాగా, చోరీ జరిగిన తరువాత ఇద్దరు వ్యక్తులు నలుపు రంగు దుస్తులు వేసుకుని అయ్యప్పనగర్‌లో పరుగెత్తుకుంటూ వెళ్లడం చూశామని కొందరు స్థానికులు చెబుతున్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డులో..

మరో ఘటనలో టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డులో నివాసముంటున్న ఎం.ఢిల్లేశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తన భార్యతో కలిసి శ్రీనివాసనగర్‌కు వెళ్లి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటం గమనించారు. అందులో బంగారం గొలుసు, రూ.7వేలు, మూడు జతల వెండి పట్టీలు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు తెలియజేసినట్లు బాధితుడు తెలిపారు.

● ఒలింపిక్ విజేతకు సైకత శుభాకాంక్షలు



ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ గేమ్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన షూటర్ మను భాకార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమదాలవలసకు చెందిన గేదెల హరికృష్ణ అద్భుత సైకత శిల్ప రూపొందించారు. బుధవారం గాజుల కొల్లివలసలోని సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో తీర్చిదిద్దిన ఈ సైకత శిల్పాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించి హరికృష్ణను అభినందించారు.

– ఆమదాలవలస

టోల్ తీస్తారిక..!



- రాష్ట్ర హైవేల్లో కొత్తగా టోల్‌ప్లాజాలు
- జిల్లాలో చిలకపాలెం–రామభద్రపురం, అలికాం–బత్తిలి, కళింగపట్నం–పార్వతీపురం రోడ్లను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం
- రోడ్ల అభివృద్ధికి పీపీపీ విధానంతో ప్రైవేటు నిర్వాహకులకు టోల్ బాధ్యతలు
- ఇక జిల్లా వాసుల జేబులకు చిల్లే..

అరసవల్లి:

సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు జనాల జేబులకే చిల్లులు పడేలా అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా టోల్ ప్లాజాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. వివిధ జిల్లాల్లో రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఉన్న ప్రధాన రహదారులు, రాష్ట్ర హోదా గలిగిన మొత్తం 27 రహదారులను గుర్తించి వాటిని ప్రైవేటు భాగస్వామ్యంతో మరమ్మతు, అభివృద్ధి చేస్తూ ఆ రోడ్లపై కొత్తగా టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దీంతో లక్షలాది మంది నాలుగు చక్రాల వాహనదారులకు ఇబ్బందులు తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

పీపీపీ పద్ధతిలో నిర్వహణ..

ఇన్నాళ్లు ఎక్కడా రోడ్లు బాగోలేవంటూ ఊదరగొట్టిన చంద్రబాబు బృందం.. ఇప్పుడు ఆ రోడ్ల అభివృద్ధికి నిధులివ్వకుండా ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యానికి పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్) విధానం పేరిట వారి నిధులతో రోడ్లను అభివృద్ధి చేసేలా చర్యలకు దిగనున్నారు. ఈమేరకు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో సమీక్షించిన అనంతరం సొంత పార్టీలకు చెందిన కాంట్రాక్టర్లకు ఈ బాధ్యతలు దక్కేలా కూడా మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో మూడు రోడ్లలో..

జిల్లాలో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్16), నరసన్నపేట–పర్లాఖిమిడి (ఎన్‌హెచ్ 326ఎ)జాతీయ రహదారుల్లోనే ఇప్పటివరకు టోల్ ప్లాజాలు నడుస్తున్నాయి. అంతరాష్ట్ర సర్వీసులు వెళ్లే ప్రధాన సరిహద్దు మార్గాలు కావడంతో ఇక్కడ రహదారుల విస్తరణ నేపథ్యంలో టోల్ వసూళ్లు కొన్నేళ్లగా జరుగుతున్న సంగతి విదితమే. అయితే ఎన్నడూ లేని విధంగా పొరుగు జిల్లాల సరిహద్దు ప్రాంతాల అనుసంధానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని మూడు రాష్ట్ర రహదారుల్లో కూడా టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ మేరకు జిల్లాలో చిలకపాలెం–రాజాం–రామభద్రపురం (130.20 కి.మీ) రోడ్డు, కళింగపట్నం– శ్రీకాకుళం– పార్వతీపురం (సీఎస్‌పీ రోడ్డు 113.30 కి.మీ) రోడ్డు, గార–అలికాం– బత్తిలి (84.80 కి.మీ) రోడ్డులో కూడా కొత్తగా టోల్ ప్లాజాలు రానున్నాయి. ఈ ప్రధాన రహదారులన్నీ మరమ్మతులకు గురయ్యాయని, వీటిని ప్రైవేటు వ్యక్తుల ఆర్థిక భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే వెంటనే టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసి వారికే నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా అడుగులు వేస్తున్నారు. వాస్తవానికి ఈ మూడు రోడ్ల పరిధిలో వందలాది గ్రామాలు, పదుల సంఖ్యలో పట్టణ ప్రాంతాలున్నాయి. విశాఖపట్నం వెళ్తేనో..లేక ఇచ్ఛాపురమో, పర్లాఖిమిడో వెళ్తేనో టోల్ బాదుడుండేది. కానీ ఇప్పుడు జిల్లాలో సరిహద్దు ప్రాంతాలకు వెళ్లాలన్నా, రాజాం, పాలకొండ, గార, కళింగపట్నం, హిరమండలం, కొత్తూరు, బత్తిలి తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఇకపై టోల్ ఫీజు బాదుడు తప్పదనే పరిస్థితులు రానున్నాయి.



చిలకపాలెం–రామభద్రపురం స్టేట్ హైవే ఇదే



కొత్త టోల్‌ప్లాజా రానున్న అలికాం–బత్తిలి రోడ్డు ఇదే..



నిత్యం రద్దీగా ఉండే సీఎస్‌పీ రోడ్డు ఇదే

టోల్ ప్లాజాలు కొత్తగా ఎక్కడెక్కడ..

- చిలకపాలెం–రాజాం–రామభద్రపురం (130.20 కి.మీ) రోడ్డు
- కళింగపట్నం– శ్రీకాకుళం–పార్వతీపురం (సీఎస్‌పీ రోడ్డు 113.30 కి.మీ) రోడ్డు
- గార–అలికాం– బత్తిలి (84.80 కి.మీ) రోడ్డు

ప్రస్తుతం జిల్లాలో టోల్ ప్లాజాలు ఎక్కడ..

- చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్16)
- నరసన్నపేట–పర్లాఖిమిడి (ఎన్‌హెచ్ 326ఎ)

ప్రస్తుతం టోల్ ఫీజు..

కారు–రూ.150 లారీ–రూ.250

రవాణా చార్జీలపై ప్రభావం..!

జిల్లా మొత్తం ఈ మూడు ప్రధాన రహదారుల్లోనే ఇమిడి ఉందనే చెప్పాలి. ఈ రహదారుల్లో టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేస్తే రవాణా చార్జీలపై ప్రభావం పడుతుంది. కార్లు, జీపులతో పాటు ఆర్టీసీ బస్సుల నుంచి కూడా టోల్ వసూళ్లు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నాలుగు చక్రాల వాహనాల్లో కార్లకు రూ. 150 వరకు, లారీలకు రూ.250, బస్సులకు కూడా ప్రత్యేక రేట్లతో వివిధ టోల్ ప్లాజాల వద్ద వసూళ్లు చేస్తున్నారు. ఇదే విధానంతో కొత్త టోల్ వసూళ్ల బాధ్యతలు కూడా దాదాపుగా అధికార పార్టీకే చెందిన నేతలు/కాంట్రాక్టర్లకు దక్కనుండటంతో మరింత జులుం పెరగనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టోల్‌గేట్ల ఏర్పాటుతో ఆర్టీసీ, రవాణా చార్జీలు కూడా పెరిగే అవకాశముంది. మొత్తమ్మీద చంద్రబాబు దృష్టిలో సంపద సృష్టి అంటే ఇదేనా.. అంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం, బొల్లినేని మెడిస్కిల్స్ (రాగోలు జెమ్స్) సంయుక్తంగా నిర్వహిస్తున్న కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండేళ్ల మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్ (40 సీట్లు), ఏడాది పీజీ డిప్లమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ (40 సీట్లు)లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. రూ.250 దరఖాస్తు రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించి ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 7995013422, 7680945357 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మెడ్‌పేస్‌కు ఎంపికైన సెంచూరియన్ విద్యార్థి


అనామ్ నవాజ్

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీకి చెందిన విద్యార్థి అనామ్ నవాజ్ యునైటెడ్ కింగ్‌డమ్ దేశంలో మెడ్‌పేస్ కంపెనీలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపిక య్యారు. వర్సిటీలో ఫైటో ఫార్మాసూటికల్స్ పూర్తి చేసిన అతనికి వార్షిక వేతనం రూ.54 లక్షలు లభించనుందని వర్సిటీ ఉపాధ్యక్షుడు డి.ఎన్.రావు తెలియజేశారు. రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో తదితరులు అభినందనలు తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య


చెట్టుకు వేలాడుతున్న సవర ప్రసాద్ మృతదేహం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పెంటిభద్ర గిరిజన గ్రామానికి చెందిన సవర ప్రసాద్(35) మద్యం మత్తులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందిరాగాంధీ కాలనీ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడినట్లు చెబుతున్నారు. ప్రసాద్‌కు భార్య యమున, కుమార్తె, కుమారుడు ఉన్నాడు. కాశీబుగ్గ ఎస్‌ఐ పారినాయుడు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

దర్జాగా ఇసుక అక్రమ రవాణా


దూసి రైల్వేగేట్ సమీపంలో ఇసుక ట్రాక్టర్

ఆమదాలవలస: మండలంలో నాగావళి నదీతీరంలో ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా పట్టపగలే దర్జాగా సాగుతోంది. దూసిపేట, దూసి తదితర ప్రాంతాల నుంచి నిత్యం ట్రాక్టర్లతో ఇసుక తరలించుకుపోతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత


పట్టుబడిన లారీ వద్ద వీఆర్‌ఓలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని అక్రమంగా తరలివెళ్తున్న ఇసుక లారీను బుధవారం వీఆర్వోలు పట్టుకున్నారు. బట్టేరు నుంచి నేరుగా జాతీయ రహదారి వైపు తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు మాటువేసి అడ్డుకున్నారు. అనంతరం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు లారీని తరలించారు. ఈ దాడుల్లో వీఆర్వోలు యశ్వంత్, గణేష్, లక్ష్మణావు, పాపారావు పాల్గొన్నారు.

450 కేజీల జీడిపప్పు బుగ్గిపాలు


కాలిపోయిన జీడిపప్పు పిక్కలు

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డులోని లక్ష్మీగణేష ట్రేడర్స్ ఫ్యాక్టరీలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఓవెన్‌లో పెట్టిన సుమారు 450 కేజీల జీడిపప్పు పిక్కలు కాలిపోయాయని యజమాని సానా చిట్టికుమార్ తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాలిపోయిన జీడి పప్పు విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని యజమాని తెలిపారు.

హిరమండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు (ఫైల్)



ఉపాధి హామీ.. వేతనాల లేమి

- మే నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వని కేంద్రం
- జిల్లాలో 1.65 లక్షల మంది వేతనదారులకు బకాయి
- పనులపై పడుతున్న ప్రభావం

హిరమండలం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి వేతన దారులకు కేంద్రం వేల రూపాయలు బకాయి పెడుతోంది. ఉపాధి పనులంటే గతంలో జాతరలా ఉండేది. గత పక్షం రోజులుగా ఈ పనులపై వేతనదారులకు ఆసక్తి తగ్గింది. ప్రతి రోజూ సగటున ప్రతి మండలంలో 6వేల నుంచి 10వేల మంది వేతనదారులు ఈ పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం ఈ పనులకు ఒక్కో మండలంలో సగటు 600మంది కూడా వెళ్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

చెల్లింపులకు బ్రేక్

జిల్లాలో 1,67,892 మంది వేతనదారులకు సుమారుగా రూ.204కోట్ల వేతనాలు అందాల్సి ఉంది. సుమారు ఆరేడు వారాలుగా ఉపాధి వేతనదారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. రోజుకు కనీసం రూ.300 వేతనం వస్తుందని చెప్పిన అధికారులు చెల్లించడంలో మాత్రం విఫలమయ్యారు. ప్రభుత్వం చొరవ కొరవడడంతో మే, జూన్, జూలై నెలల్లో పనిచేసిన వారికి ఇంతవరకు వేతనాలు అందలేదు. గతంలో ప్రతి 15 రోజులకు ఒక సారి వేతనదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమయ్యేది. ప్రస్తుతం దాదాపు ఆరేడు వారాల పాటు వేతనాలు మంజూరు కావడం లేదు. ఒక్కో వేతనదారునికి 35నుంచి 45 రోజులకు సంబంధించిన వేతనం అందాల్సి ఉంది. సగటున ఒక్కో కూలీకి రోజుకు రూ.200 చొప్పున లెక్క వేసుకున్నా సుమారు రూ.8 వేలు చెల్లించాల్సి ఉంది. వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో కొద్ది రోజులుగా వేతనదారులు పనులకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. గతంలో వేలల్లో పనులకు వెళ్తే ప్రస్తుతం వందల్లోనే వెళ్తున్నారు.

జిల్లాలో ఉపాధి వేతనదారుల బకాయి వివరాలు

మండలం	వేతనదారులు	బకాయి (రూ.కోట్లలో)
ఆమదాలవలస	4044	5.10
బూర్జ	4790	5.90
ఎచ్చెర్ల	7509	9.70
జి.జిగడాం	5294	6.20
గార	8797	10.92
హిరమండలం	3124	3.75
ఇచ్ఛాపురం	2441	2.87
జలుమూరు	7501	9.40
కంచిలి	5449	6.45
కవిటి	2910	3.35
కోటబొమ్మాళి	7781	8.64
కొత్తూరు	7100	8.4
లావేరు	5563	6,38
ఎల్ఎన్‌పేట	4620	5.31
మందస	8197	10.48
మెళియాపుట్టి	6500	7.30
నందిగాం	6453	7.35
నరసన్నపేట	6230	7.28
పలాస	3483	4.31
పాతపట్నం	4700	5.33
పోలాకి	7248	8.68
పొందూరు	5371	5.72
రణస్థలం	8412	10.30
సంతబొమ్మాళి	7138	8.92
సారవకోట	6127	8.32
సరుబుజ్జిలి	3842	4.80
సోంపేట	3640	4.42
శ్రీకాకుళం	6563	8.11
టెక్కలి	4551	5.91
వజ్రపు కొత్తూరు	2514	2.89

ఈ విషయమై ఎన్ఆర్ఈజీఎస్ హిరమండలం ఏపీఓ శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా బిల్లుల చెల్లింపులో జాప్యం వాస్తవమేనన్నారు.

ఇబ్బందుల్లో ఉన్నాం



ఆరువారాలు పనిచేసినా కూలి డబ్బులు అందలేదు. దీంతో పనులకు వెళ్లాలన్న ఆసక్తి ఉండటం లేదు. గతంలో 15 రోజుల్లో డబ్బులు పడేవి. ఇప్పటివరకు పనిచేసిన పనులకు డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది.

– వి.వనజాక్షి, ఉపాధి వేతనదారు, హిరమండలం

అంతా పెండింగే



ఉపాధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో డబ్బులు రావడం లేదు. ఏడు వారాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. గతంలో ఎప్పటి కప్పుడు బిల్లులు పడేవి ఇప్పుడా పరిస్థితి లేదు.

– బి.గంగాధరరావు, ఉపాధి వేతనదారుడు, గులుమూరు

త్వరలో బిల్లులు వస్తాయి



ఉపాధి పనులు చేసిన కూలీలందరికీ త్వరలోనే బిల్లులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వం వారం రోజుల్లో నిధులు విడుదల చేయనుంది. కూలీలు ఆందోళన చెందవద్దు. పనిచేసిన కూలీ సొమ్మంతా ఖాతాలకు జమవుతాయి. కూలీలు యథావిధిగా పనులు చేయాలి. – జీవీ చిట్టిరాజు, డ్వామా పీడీ, శ్రీకాకుళం

పాఠశాలల్లో ఎన్నికల నగారా

- నేడు ఎస్ఎంసీ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- 8న సభ్యులు, ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నిక


ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ ఓటరుజాబితా తయారీలో కవిటి ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరరావు

కవిటి : ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 8న జరగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల షెడ్యూల్ ప్రకటన గురువారం వెలువడనుంది. జిల్లా వ్యాప్తంగా 2267 పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఆగస్టు ఒకటో తేదీన ప్రకటన విడుదల చేస్తారు. వివరాలను పాఠశాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచుతారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాల పరిధిలో ఎన్నికల్లో సభ్యులుగా ఎంపికైన వారు ఓటింగ్‌కు అర్హులు. ఐదు తరగతులు ఉన్న పాఠశాలలో ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున 15 మంది సభ్యుల్ని ఎంపిక చేస్తారు. ప్రతీ పాఠశాలలో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లను 15 మంది సభ్యుల నుంచి ఎన్నుకుంటారు. వీరిద్దరిలో ఒకరు కచ్చితంగా మహిళ ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది.

ఇదీ షెడ్యూల్..

1న నోటిఫికేషన్, 5న ఓటరు జాబితా అభ్యంతరాలు తెలియజేయడం, 8న ఎన్నికల నిర్వహణ, ఎస్ఎంసీ కమిటీ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ముగించడం, ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్లను ఎన్నుకుని ప్రమాణస్వీకారం చేయడంతో ప్రక్రియ ముగుస్తుంది.

నిబంధనలు ఇవే..

- ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు. ఒకరు తప్పక ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీ అయిఉండాలి. మరొకరు బీసీ/ఈబీసీ/మైనారిటీ వర్గాలకు చెందిన వారై ఉండాలి. 50 శాతం ఓటర్లు (కోరం) తప్పనిసరి.
- ఒక క్లాసులో ఆరుగురు విద్యార్థులు లేకపోతే ఎగువ లేదా దిగువ తరగతిలో విలీనం చేసి సభ్యులు ఎన్నుకోవాలి.
- కమిటీ ఎన్నిక జరిపిన వెంటనే తీర్మానం రాసి ప్రమాణ స్వీకారం చేయించాలి.
- కమిటీకి అదనంగా ఆరుగురు ఎక్స్ అఫీషియల్ సభ్యులు ఉంటారు. వీరిలో సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ (మెంబర్ కన్వీనర్), మహిళా విభాగం నుంచి సీనియర్ టీచర్(మెంబర్), కార్పొరేటర్/కౌన్సిలర్/వార్డుమెంబర్, అంగన్‌వాడీ వర్కర్, ఫిమేల్ మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్, గ్రామైక్యసంఘం అధ్యక్షురాలు ఉంటారు.

పటిష్టంగా ఎన్నికల నిర్వహణ



జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, గిరిజన, ఆశ్రమ పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూల్స్, కేజీబీవీలలో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం.

– ఆర్.జయప్రకాష్, సమగ్ర శిక్ష ఏపీసీ, శ్రీకాకుళం

బాలల హక్కులు పరిరక్షిద్దాం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలల హక్కులను సంరక్షించడం అందరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని న్యాయ సేవాసదన్‌లో బుధవారం జువైనల్ పోలీసు అధికారులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. బాలబాలికలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆశ్రయించేలా చైతన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్, డీసీపీఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులూ.. ఇదేం తీరు!

- గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు
- పోలీసులే వచ్చి విడిచిపెట్టించిన వైనం


అనుమతులు లేకుండా తరలిస్తున్న గ్రావెల్ ట్రిప్పర్లు


వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రావెల్ తరలింపుదార్లతో మాట్లాడుతున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్ల సమీపంలో రెండు ట్రిప్పర్లతో గ్రావెల్ అక్రమంగా తరలిపోతుండగా బుధవారం ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి రాంబాబు, సత్తారు గోపి, మొదలవలస కృష్ణారావు, సీపాన దిలీప్‌కుమార్, గురుగుబెల్లి మహేష్‌లతో కూడిన బృందం అడ్డుకుంది. ఎక్కడి నుంచి గ్రావెల్ తెస్తున్నారని ఆరాతీయగా.. చిలకపాలెం పంచాయతీ నారాయణపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 15/2, 3, 4 నుంచి తీసుకువచ్చినట్లు గుర్తించారు. తోటపాలేం పంచాయతీ పెయిలవానిపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి కోసం తీసుకెళ్తున్నట్లు డ్రైవర్లు తెలియజేశారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు మైనింగ్, రెవిన్యూ, పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అయినా అధికారులు స్పందించ లేదు. అనంతరం ఎచ్చెర్ల ఎస్సై ఎస్.చిరంజీవితో కూడిన పోలీసు సిబ్బంది చేరుకుని ట్రిప్పర్లు విడిచిపెట్టాలని నాయకులకు చెప్పారు. విడిచిపెట్టకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో చేసేది లేక వదిలిపెట్టారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారికి పోలీసులు మద్దతుగా నిలవటం విమర్శలకు తావిచ్చింది.

ఆదాయపు పన్ను సక్రమంగా చెల్లించాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి రవిశంకర్

టెక్కలి: ఆదాయపు పన్ను చెల్లించే విషయంలో అతి తెలివితో చిక్కుల్లో పడవద్దని ఆదాయపు పన్ను జిల్లా అధికారి కె.రవిశంకర్ హితవుపలికారు. ఆదాయపు పన్ను చట్టాలపై బుధవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆదాయపు పన్ను పరిధిలో ఉన్న ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ట్యాక్స్ చెల్లించాలన్నారు. ఈ క్రమంలో ఎక్కడైనా తప్పిదాలకు పాల్పడితే వారి వివరాలు తమకు అందుతాయని, ఆదాయపు శాఖా పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. రాయితీల విషయంలో కొన్ని సంస్థలకు అర్హతను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవితేజ, కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సీఏఓ ఎన్.ఎ.ఎన్.రాజు, డీన్లు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

- అనుమానాలు ఉన్నాయంటున్న కుటుంబ సభ్యులు
- అధికారులను నిలదీసిన దళిత సంఘాల నాయకులు


అక్షిత (ఫైల్)

నందిగాం:

స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్న లిమ్మక అక్షిత (16) మంగళవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రిన్సిపాల్ దమయంతి, నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం పారాపురం సమీపంలోని మహసింగి గ్రామానికి చెందిన లిమ్మక గిరి, శ్రావణిలకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె అక్షిత జూలై 24న జరిగిన రెండో విడత కౌన్సిలింగ్‌లో నందిగాం బాలికల గురుకులంలో ఇంటర్మీడియెట్‌లో చేరింది. 26వ తేదీన హోమ్ సిక్ అంటూ ఇంటికి వెళ్లి మరలా 29న గురుకులానికి వచ్చింది. యథావిధిగా తరగతులకు హాజరైంది. మంగళవారం రాత్రి 9.30 గంటల వరకు స్టడీ అవర్‌లో చదివి అందరితో పాటు నిద్రపోయింది. బుధవారం వేకువజామున సెక్యూరిటీ గార్డులు వచ్చి విద్యార్థులను నిద్రలేపుతుండగా 6వ తరగతికి చెందిన వనగాల్ల పల్లవి టాయిలెట్‌కు వెళ్లగా పక్కనే ఉన్న కిటికీకి అక్షిత వేలాడుతూ కనిపించింది. వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి చెప్పడంతో వారు ప్రిన్సిపాల్‌కు సమాచారమిచ్చారు. పక్కనే క్వార్టర్స్‌లో ఉన్న ప్రిన్సిపాల్ వచ్చి చూసి విషయాన్ని ఉన్నతాధికారులకు, నందిగాం ఎస్సైకు, తహసీల్దారు, విద్యార్థిని తల్లికి తెలియజేశారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీం వివరాలు సేకరించింది. మృతదేహాన్ని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


రోదిస్తున్న తల్లి శ్రావణి

న్యాయం చేయాలి..

అనంతరం గురుకులానికి చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తాము వచ్చేవరకు మృతదేహాన్ని ఉంచకుండా ఆస్పత్రికి తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్, ఎస్సైలను నిలదీశారు. అక్షిత మృతిపై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని తల్లి శ్రావణి, మేనమామ బాడ రవీంద్రబాబు డిమాండ్ చేశారు. మృతురాలి తండ్రి గిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతురాలి తండ్రితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పారు. అనంతరం దళిత హక్కుల పోరాట కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి అక్కురాడ లోకనాథం, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగాన తిరుపతి రావు, కులనిర్మూలన పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకరరావు, స్థానిక నాయకులు జద్యాడ జయరాంలు మాట్లాడుతూ బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులు అధైర్యపడవద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నందిగాంలో ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన వైనంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు అధైర్య పడవద్దని, సమస్యలు ఉంటే హెచ్ఎంకు తెలియజేయాలన్నారు. కాగా, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతిశ్రీ పాఠశాలకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి మనోధైర్యం కల్పించారు.

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థిని ఆత్మహత్య ఉదంతంపై జిల్లా అధికారులు, గురుకులం జిల్లా కో–ఆర్డినేటర్లు పూర్తి నివేదిక అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు.

39 మంది తహసీల్దార్లకు పోస్టింగ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల విధుల నుంచి ఇతర జిల్లాలకు వెళ్లి తిరిగివచ్చిన తహసీల్దార్లకు ఎట్టకేలకు పోస్టింగ్ దక్కింది. జిల్లాలో 39 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే విధుల్లోకి చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ముందుగా భావించినట్లే కొందరు తహసీల్దార్లు కలెక్టరేట్‌ను వీడలేదు. వారికి సెక్షన్లు మాత్రమే మార్చారు. ఇప్పుడైనా వారు పరిధి దాటి విధులు నిర్వహించకుండా నియంత్రించగలిగితే కొంతమేర ఉద్యోగులకు మేలు జరుగుతుందని రెవెన్యూ ఉద్యోగులు భావిస్తున్నారు.

సిఫారసుల మేరకే..

జిల్లాలో 30 మండలాల్లో తహసీల్దార్లకు నియామకాలు ఇచ్చినా వారిలో అందరికీ సిఫారసులు మేరకే పోస్టింగ్ ఇచ్చినట్లు సమాచారం. జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలు పొందేందుకు కొందరు రూ.లక్షల్లో ముడుపులు కడితే, మరికొందరు వారు చెప్పిన పనులన్నీ చేస్తామని, ప్రధానంగా ప్రభుత్వ భూముల మార్పులు చేర్పులు చేసేందుకు భరోసా ఇచ్చి లేఖలు పొందినట్లు తెలిసింది.

పోస్టింగ్ స్థానం	తహసీల్దార్				
కలెక్టరేట్ పరిపాలనాధికారి	జి.సూర్యనారాయణ	శ్రీకాకుళం	ఎస్.గణపతిరావు	నరసన్నపేట	టి.హనుమంతరావు
సీ–విభాగం సూపరింటెండెంట్	రాజేశ్వరరావు	పోలాకి	ఎం. సురేష్ కుమార్	పాతపట్నం	ఎస్.కిరణ్ కుమార్
హెచ్–విభాగం సూపరింటెండెంట్	బి.ప్రకాశరావు	రణస్థలం	ఎన్.ప్రసాదరావు	బూర్జ	ఈశ్వరమ్మ
డి–విభాగం సూపరింటెండెంట్	డి. రమణమూర్తి	వజ్రపుకొత్తూరు	పి.బాల	ఎల్ఎన్ పేట	వై.విపద్మావతి
ఈ– విభాగం సూపరింటెండెంట్	పి.సరోజిని	సారవకోట	కె.విజయలక్ష్మి	టెక్కలి	ఎస్.దిలీప్ చక్రవర్తి
టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో	జి. ప్రభాకరరావు	హిరమండలం	బి.వెంకటరమణ	కవిటి	బి.మురళీకృష్ణ
శ్రీకాకుళం డివిజన్ కార్యాలయం ఏవో	జె.రామారావు	పొందూరు	ఎన్.రమేష్ కుమార్	జి.సిగడాం	ఎం.శ్రీకాంత్
పలాస డివిజన్ కార్యాలయం ఏవో	ఎస్.హైమావతి	ఇచ్ఛాపురం	ఎన్.వెంకటరావు	కోటబొమ్మాళి	ఆర్.అప్పలరాజు
స్పెషల్ తహసీల్దార్, గెయిల్	కె శ్రీరాములు	జలుమూరు	జి.లక్ష్మీనారాయణ	సరుబుజ్జిలి	ఎల్.మధుసూదనరావు
స్పెషల్ తహసీల్దార్, కొవ్వాడ	పి.వేణుగోపాలరావు	గార	ఎస్.రమణారావు	కొత్తూరు	బి.పాపారావు
కేఆర్ఆర్‌సీ శ్రీకాకుళం డివిజన్	ప్రవల్లికా ప్రియ	ఎచ్చెర్ల	ఎ.సింహాచలం	సోంపేట	బి.అప్పలస్వామి
కేఆర్ఆర్‌సీ టెక్కలి డివిజన్	బీఎస్ఎస్ సత్యనారాయణ	పలాస	బి.సత్యం	కంచిలి	వై.జయలక్ష్మి
		మెళియాపుట్టి	ఎస్.హనుమంతరావు	లావేరు	వై.జోగారావు
				మందస	బీడీవీ ప్రసాదరావు

దేవదాయ భూమిలో మాంసం అమ్మకాలు

- ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేసిన అధికారులు


టెక్కలిపట్నంలో ఏర్పాటు చేసిన మాంసం షెడ్ ఇదే

కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నంలో గొప్పిలి రోడ్డుకు ఆనుకుని ఉన్న దేవదాయశాఖ భూమిలో కొంత మేర స్థలం ఆక్రమణకు గురికావడమే కాకుండా అందులో మాంసం విక్రయాలు చేపట్టంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సర్వే నంబర్ 15/6లో దేవదాయ శాఖకు రెండు ఎకరాల పద్నాలుగు సెంట్ల స్థలం ఉంది. అందులో రెండు సెంట్లను కొందరు ఆక్రమించుకుని షెడ్ వేసి మాంసం అమ్మకాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న దేవదాయశాఖ ఈఓ వాసుదేవరావు, ఇన్‌స్పెక్టర్ ప్రసాదబాబు తనిఖీలు చేపట్టి నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. తక్షణమే షెడ్ తొలగించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో నిర్వాహకులు రెండు రోజుల గడువు కోరారు. పరిశీలనలో నాయకులు పానిల కృష్ణారావు, దేవదాయశాఖ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ B.A; B.Com, B.Sc, B.Lisc, BBA; M.A; M.Com; M.Sc; M.Lisc; MSW కోర్సుల డిస్టెన్స్ మరియు రెగ్యులర్ కొరకు సంప్రదించండి. శ్రీశివాని డిగ్రీ కళాశాల – డే & నైట్ జంక్షన్, శ్రీకాకుళం. ఫోన్ : 99893 64332, 85009 60827 [V- 2651]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185371]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీ రూం+భోజనం.HYD.Ph: 6309020999 [HA-432]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14415]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.